దీనికి బాధ్యులు ఎవరు?

శ్రీ సి. సి. పున్నయ్య

చల్లబడుతున్న సాయంకాల సమయం. ప్రచండ భానుడు ప్రసన్నుడయ్యాడా అన్నట్లు మెల్ల మెల్లగా పశ్చిమాద్రిలో క్రుంకుతున్నాడు. బాధ్యతలన్నా, కష్టాలన్నా తెలియని బాల బాలికలు ఉత్సాహాతిశయంతో ఆడుకుంటున్నారు. ఆలమందలు పొలాల నుండి స్వస్థానాలకు తరలి వస్తూంటే దూడలు మోర లెత్తి అరుస్తూ స్వాగత మిస్తున్నవి. నిరాశా నిస్పృహలకు గురియయిన మానవులు సయితము విశ్రాంతి, పునర్జీవం కొరకు గుట్టలు గుట్టలుగా ఉద్యానవనాల్లో, నిర్జన ప్రదేశాలలోకి చేరుకొంటున్నారు. కార్ఖానాలలోను, కార్యాలయాలలోను పనిచేస్తున్న కార్మికులు, గుమాస్తాలు గంట కొట్టంగానే గొర్లమందల లాగ ఎవరి యిండ్లకు వాళ్లు బయలుదేరుతున్నారు.

ఆ కార్యాలయంలో ఆ టేబులు దగ్గర పని ఎప్పుడూ తరగదు. రాత్రీ పగలూ అనే విచక్షణ అసలేలేదు. కట్టలు కట్టలుగా కాగితాలు ఎప్పుడూ ఆ బక్కపీచు గుమాస్తా దృష్టికి వస్తూనే యుంటవి. ఏంచేస్తాడు పాపం? ఎంతచేసినా పని పెరుగుతూనే

యుంటుండె ! అలాగే నెలలు, సంవత్సరాలు గడిచి పోతున్నవి. ఆ రోజున ఎందుకో ఆఫీసు కాగితాలు చూస్తూ చూస్తూ గడియారంవైపు చూచాడు. "అప్పుడే ఆరుగంటలు కాబోతున్నదే" అనుకుంటూ టేబిలుమీద కాగితాలుసర్ది యింటికి బయలుదేరి వెళ్లాడు. దారిలో తాను సినిమాకు వెళ్దామని చెప్పివచ్చి, యింటికి ఆలస్యంగాపోవడంవలన శాంతకు కలిగిన ఆశాభంగాన్ని ఊహించుకుంటూ యిల్లు చేరాడు. సాధారణంగా తాను ఆఫీసునుండి రావడం చూచి గడపల్లోకే చిరునవ్వుతో ఎదురొచ్చి కోటు, బూట్లువిప్పే శాంతజాడ ఆ రోజున కనబడకపోవడం అతనికి కొంత ఆందోళన కలిగించింది.

"ఏమిటా కారణం ... ... " అనుకుంటూ హాలులోని సోఫాలో కూలబడి బూట్సులువిప్పి మెల్లగా మేడమీదికి వెళ్లాడు. అక్కడా శాంత కనుపించక నలువైపులా చూచాడు; రెండుసార్లు పిలిచాడు. అతని ఒంటరితనాన్ని గదిలోని కుర్చీలు, పటాలు హేళనచేస్తున్నట్లనిపించినవి. తన గత ఆరు నెలల వైవాహిక జీవితపు మధురస్మృతులు, యిప్పటి ఏకాకి జీవితము మనసును కలచివేస్తున్నవి. ఆరు నెలల కాలంలో శాంత తన కనుసన్నలలో మెలగిందికదా — మరి యీనాడు— యిప్పుడు —— ఏదీ — తాను ఆఫీసులోచేసే శ్రమనంతా మరపించే శాంత మందహాసం — గ్లాసునిండా కాఫీ ఏవీ ?

శాంత, శేఖర్‌ల అనురాగ దాంపత్యాన్నిచూచి ఆదర్శనీయమయిందని కొందరనుకుంటుంటే మరి కొందరికి కళ్లుకుట్టినవి. కొందరికేమిటి - శేఖర్ తల్లే వాళ్ళిద్దరినిచూచి మూతి, ముక్కు విరుస్తూ "ఎప్పుడూ పెళ్లాన్ని చూచుకుంటూ మొగుడు, మొగుడుని చూచుకుంటూ పెళ్ళామూ కూర్చుంటే యింట్లో చాకిరి ఎవరు చేస్తారు" అని రుసరుసలాడుతుండేది. వాస్తవానికి శాంత చాల నెమ్మదయింది. పనిపాటలలో ఎప్పుడూ తప్పించుకు తిరగాలని చూచేదికాదు. అయినా అత్తగారి రుసరుసలకు అంతుండేదికాదు. తల్లి రాకాసి తనానికి వెరచి శేఖర్ చూచీ చూడనట్లు, వినీ విననట్లు ఆడంగుల గొడవలలో జోక్యం కలిగించుకోకుండా యుండేవాడు. బహుశా యింట్లో అత్త కోడండ్రమధ్య ఏదో గొడవ జరిగియుంటుందని అనుకుంటుండగానే శాంత కాఫీగ్లాసు పుచ్చుకొని వచ్చింది. కాఫీగ్లాసు అందుకుంటూ శేఖర్ "ఏమిటి శాంతా ! అలాగున్నావు - ఆ రేగిన వెంట్రుకలేమిటి ? - ఎందుకు కళ్లు ఎర్రబడి యున్నవి" అని అడిగాడు.

శాంత తలవంచుకొని ఏమిమాట్లాడలేదు.

"ఏం వళ్లు బాగలేదా - డాక్టరును పిలుచుకొని వచ్చేదా" అని అడిగాడు.

శాంత కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి. ఖాళీ అయిన కాఫీ గ్లాసును తీసికొని యింటిలోకి వెళ్లిపోయింది. శాంతలోని మార్పుకు కారణం ... తన తల్లి ఏదో నెపంతో తగవులాడో లేక తిట్టో యుంటుందని గ్రహించాడు.

కాలచక్రం నిరాటంకంగా సాగిపోతున్నది. అత్తగారు ఎన్నిఅన్నా, ఎన్ని కష్టాలు పెట్టినా పల్లెత్తుమాట అనకుండా శాంతకాలం వెళ్లబుచ్చుతున్నది. భర్త కవన్నీ తెలిసీకూడ మెదలకుండా యుండటం శాంత మనస్సును కలవరపరస్తున్నా ఏనాటికైనా నిజమును గ్రహించకలుగుతారని ఆశించింది.

శేఖర్‌కు ఏదోపనియుండి ఉద్యోగానికి సెలవు పెట్టి మరొక యూరికి వెళ్ళాడు. ఆ రోజున ఉదయం శాంత పిల్లల కన్నంపెట్టి చేతులు కడుగుతున్నది. అప్పుడే బావినుండి స్నానంచేసి నీళ్ళబిందె నెత్తుకొని వచ్చిరాగానే అత్తగారు "రంకుముండా యిది ఎంత కాలంనుండి - లేచిపో - నీ కిష్టమయిన వాడితోనే పోయియుండు" అని యిల్లు ఎగిరిపోయేటట్లు వరవళ్లు త్రొక్కింది.

శాంత నిర్ఘాంతపోయింది. ఆ రంకెలువిని చుట్టుపట్ల యిరుపొరుగునున్న వారంతా గుమిగూడారు. వాళ్లందరితోటి శాంతకు రంకులుకట్టి నానాతిట్లు తిడుతూ గోలగోలగాఏడుస్తూ బజారు కెక్కింది. అయోమయావస్థలో శాంతకు ఏమి పారుబోలేదు.

గుమికూడినవారిలో చాలమంది "శాంత అటువంటి పిల్లకాదు; నోట్లో నాలుకలేనిది" అన్నారు. మరి కొందరు "ఎవరో పాడుముండలు యీ పుకారు పెట్టియుంటా"రన్నారు. యింకా కొందరు "ఏమో నమ్మా - యిందులో కొంత కాకపోయినా కొంత నిజంలేకపోతే పుకారు ఎలాగ పుడుతుంది" అన్నారు.

శాంత గుడ్లనీరు గుడ్ల కుక్కుకుంటూ యింట్లోనుండి బయటికిరాలేదు. గుమికూడియున్నవాళ్లు అలాగే నిలబడి యున్నారు. "అదైనా యుండాలి లేదా నేనైనా యుండాలికాని యిద్దరం ఉండటం యింక కుదరదు" అని బెబ్బులిలాగ గర్జిస్తున్నది.

ఆ రోజున వడగాలి తీవ్రంగా కొడుతున్నది. ఎండ క్రిందమీదకూడ మాడ్చివేస్తున్నది. శేఖర్ నడి ఎండలో తిరిగి తిరిగివస్తూ తమ యింటెదుటి ఆ కోలాహలమంతా చూచేటప్పటికి గుండెల్లో బండ పడ్డట్లయింది. ఇంటిగడపలో కాలుపెట్టేసరికి శేఖర్ తల్లి పెద్దపెట్టున ఏడుస్తూ "ఇంకేముందిరా నాయనా! - యీ పాడుముండ మూలంగా మనపరువు ప్రతిష్టలు మంటగలిసి పోయేరోజులు వచ్చాయి. నేనిక బ్రతుకలేను" అంటూ బావిలో దూకడానికని పోబోయింది.

"ఏమిటమ్మా! యీ రచ్చంతా - అసలు సంగతేమిటో చెప్పు - యీ బజారు కెక్కడమేమిటి" అని శేఖర్ బ్రతిమలాడాడు.

"ఏమని చెప్పమంటావురా నాయనా!-నీ పెళ్ళాము నివురుకప్పిన నిప్పు - నీతో యిచ్చకాలు ఆడుతూనే ప్రక్కయింటి సుబ్బారావుతో ..." అంటూ గోడుగోడున ఏడ్వసాగింది.

ఎండలోబడివచ్చిన శేఖర్‌కు ఆకలిదప్పు లొకప్రక్క, యీ రచ్చ మరొకప్రక్క మహాచీకాకు పరచినవి. "అయితే యీ రచ్చంతా ఎందుకమ్మా" అన్నాడు బ్రతిమలాడే ధోరణిలో.

"నీ పెళ్ళాన్ని వెనకేసుకొనివచ్చి నేను చేసేది రచ్చంటావటరా కాబట్టే నిన్ను అది వెధవనుచేసి యింకొకణ్ణి తగులుకుంది. మీరే యుండండి యీ కొంపలో-నేను చెరువో, నుయ్యో చూచుకుంటాను" అని ఊరిమీదికి బయలుదేరింది.

శేఖర్ కాళ్ళావేళ్ళాబడి "మెల్లగా విచారిద్దాముండమ్మా! - యీ రచ్చ రాద్ధాంతమువలన నలుగురు నవ్విపోవడమేతప్ప మరేమిలాభంలేద"ని శాయశక్తుల బ్రతిమలాడి భంగపడ్డాడు. ఆమె ఇంటింటి దగ్గర బారలేస్తూ చెప్పి చెప్పి ఏడుస్తూ బయలుదేరింది.

శేఖర్ మెల్లగా గదిలోకి వెళ్లేసరికి పిల్లలొకప్రక్క, శాంత ఒక ప్రక్కనవచ్చి భోరున ఏడ్వసాగారు. పగులగొట్టుకపోతున్న తలను రెండు చేతులతో చిక్కబట్టుకొని కుర్చీలో కూలబడ్డాడు.

శాంత మెల్లగావచ్చి జలజల రాలుతున్న కన్నీటితో "ఏమండీ! మీరూ నా శీలాన్ని శంకిస్తున్నారా" అంటూ కూలబడి శేఖర్ పాదాలను పట్టుకున్నది.

"ఏమిచెయ్యమంటావు శాంతా! ... ఏమి లేకుండా యీ గొడవంతా ఎందుకు వచ్చియుంటుంది" అన్నాడు శేఖర్ ముఖము చిట్లించుకుంటూ.

"మీ అమ్మ తనస్నేహితురాలెవతో ఏదో చెప్పిందని నా జీవితాన్ని బజారులో పెట్టింది. ఇన్ని సంవత్సరాలనుండి కాపరముచేస్తున్న నన్ను మీరు అర్థం చేసికోలేకపోయారా! మీ అమ్మ యింతకాలము నుండి నా పట్ల ఎలాగ వ్యవహరిస్తున్నది మీరు చూస్తూనే యున్నారుకదా! ఇంతకాలమునుండి ఎన్ని బాధలుపడుతున్నా మీ ప్రేమాను రాగాలతోటి, పిల్లలకొరకని జీవించి యున్నాను. మీరే నా శీలాన్ని శంకిస్తే నేను జీవించడం అనవసరం, తర్వాత మీ దయ ..." అన్నది. పిల్లలు బిక్కమొగమేసుకొని నిలబడి చూస్తున్నారు.

శేఖర్‌కు ఏమి పాలుపోలేదు. ఏమిమాట్లాడకుండా లేచిపోయాడు.

శేఖర్ తల్లి ఆ యూళ్ళోనే తన మేనల్లుని యింటికిచేరి యింటింట కుమారుడు రంకుముండైన భార్య వలలోపడి తన కన్నము పెట్టడంలేదని అసభ్యంగా ప్రచారం సాగించడం మొదలు పెట్టింది. ఊళ్ళోని చిన్న, పెద్ద, అయినవాళ్లు, కానివాళ్లు శేఖర్‌ను ఏదో వింతగా చూడటం మొదలు పెట్టారు. కొందరు స్నేహితులు "కాస్తో కూస్తో నిజములేకపోతే యీ అప్రతిష్టంతా ఎందుకు వస్తుందిరా" అనసాగారు. శాంత స్వభావం తెలిసినవారు ఆ యపవాదును నమ్మకపోయినా "ఈ పాడుముండ నోరు మంచిది కాదు" అని భయపడి యూరుకొనేవారు.

శేఖర్‌లో చెలరేగిన అంతర్యుద్ధం ఎడతెరపిలేనిదైంది. ఎంత తరచిచూచినా శాంత నిర్దోషిగానే కనుపించింది. కాని తల్లి చేస్తున్న తగడం, దుష్ప్రచారంతో తాను నలుగురిలో తలెత్తలేకుండా యున్నాడు. తల్లిని చంపేద్దామా అన్నంత కోపం వచ్చేది - కాని దానివలన ఏర్పడే పరిణామాలు ...... క్రమంగా శేఖర్ . మతిలేనివాడిలాగై పోయాడు. అన్నపానములమీద, కట్టుకునే గుడ్డలమీద - మరిదేనిమీద శ్రద్ధలేకపోయింది. తిన్నపూట తినేవాడు నాలుగు మెతుకులు ; పిల్లలేలాగున్నారో, శాంత ఎలాగున్నాదో - ఎవరితోను ఏమిమాట్లాడేవాడుకాదు. ఆఫీసుకుపోవడం మానేసి చాలకాలమయింది. అతని వాలకం, కుటుంబ పరిస్థితినిచూచి యిదంతా తన మూలంగానేకదాయని తానీజీవితరంగాన్నుండి తప్పుకుంటే తన పిల్లలు, భర్త సుఖపడతారేమో ననుకున్నది శాంత. ఒక రోజున గాఢాంధకారంలో పరలోక జీవితాన్ని వెతుక్కుంటూ బయలు దేరిపోయింది.

మరునాడు శాంత శవం ఊరిబెలుపలి బావిలో తేలియాడటంచూచి ఊళ్ళో చిన్న పెద్ద అంతా చుట్టూ చేరారు. పిల్లలు గొల్లుమన్నారు. వచ్చీరాని దుఃఖంతో ఆదరించడానికి వచ్చిన తల్లినిచూచి "అమ్మా ! వచ్చావా ! - ఇక నీకు, నీ కుటుంబానికి అప్రతిష్ట యుండదు ! కొడుకూ, కోడలు, మనుమలు, మనుమరాండ్రతో జీవయాత్ర గడిపేగీత నీకున్నట్లయితే నీకీబుద్ధి పుట్టేదికాదు. ఇకమీదట మాగొడవ లేకుండా స్వేచ్ఛగా జీవించు; మేము వెళ్ళిపోతున్నాము" అని పిల్లలను వెంటబెట్టుకొని శేఖర్ వెళ్ళిపోయాడు. ఎక్కడికో ! - శాంత నన్వేషిస్తూనేమో !

"అయ్యా! మీ పేరేమిటండీ"

"ఎ. వి. రావు అండీ"

మీ చేత జాబు వ్రాయించుకుందామని వచ్చాను; మీకు ఏవి రాకపోతే మీరిక నాకు జాబు వ్రాసిపెట్టేదేమిటి"

వి. నాగేశ్వరరావు

♦ ♦ ♦

"పతిగృహస్తుడు ఖద్దరు వాడకమునందలి కళాకాంతులను హర్షించడానికి అలవాటుపడి దాని లావణ్యాన్ని పవిత్రాశయాలను గ్రహించకలుగాలి.

'గాంధీజీ'